క్లుప్తంగా

మందుబాబులకు రూ.3 లక్షల జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 30 మందికి కోర్టు రూ.3 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. శనివారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న డీఆర్‌ఎం లలిత్‌బోరా



డీఆర్‌ఎం లలిత్‌బోరాకు ప్రసాదం అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బోరా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రోటోకాల్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ ఆయనకు ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమేష్‌కుమార్ కూడా..

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం అడ్మినిస్ట్రేటివిట్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఘనంగా ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న మహిళలు

సబ్బవరం: సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వర స్వామి, లక్ష్మీగణపతి, శ్రీనందీశ్వర శిలా విగ్రహ సహిత పసిడి కలశ ప్రతిష్టాపన మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి వేద పారాయణ, పంచగవ్య ప్రాశన, జలాదుద్ధరణ, క్షీరాధివాసం నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణ విగ్రహ వాస్తుపూజ, హోమం, ధాన్యాధివాసం, పంచశయ్యాదివాసం, నీరాజన మంత్రపుష్పం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు బారులుతీరి అభిషేకాలు, పూజలు చేశారు. ఆదివారం పసిడి కలశ ప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంట సింహపురి కాలనీ వద్ద మామిడితోటలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుమ్ము రేగుతోంది

కొంచెం దుమ్ము రేగితేనే ఎంతో ఇబ్బంది పడతాం.. రక్షణ కోసం ముఖానికి మాస్క్ వేసుకుని ప్రయాణిస్తాం. కానీ ఆ ప్రాంతంలో ప్రజలు నిత్యం దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్నారు. బూడిద లారీలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించడంతో, రోడ్డుపై పడిన బూడిద ఎగసిపడి కళ్ల మంటలు, ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లు దుమ్ము కొట్టుకుపోతున్నాయి. కనీస నిబంధనలు పాటించని కాంట్రాక్టర్ల తీరు ఆ మార్గం వెంబడి గ్రామాల్లో నివసిస్తున్న వారితో పాటు ఆ రోడ్డులో ప్రయాణిస్తున్న వారికీ నరకం చూపిస్తోంది.



కారిడార్ రహదారిలో దుమ్ము రేపుతూ వెళ్తున్న బూడిద లారీ

- యథేచ్ఛగా బూడిద లారీల రాకపోకలు
- కనీస జాగ్రత్తలు పాటించని కాంట్రాక్టర్లు
- దుమ్ము, ధూళితో నిండుతున్న రోడ్లు
- ప్రయాణికుల అవస్థలు
- రోగాలపాలవుతున్న గ్రామస్తులు



ఏలేరు కాలువ వద్ద దుమ్ము రేపుతున్న లారీలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలతో వాహనదారులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో చేపడుతున్న భారీ వంతెనలు, రహదారుల నిర్మాణాలతో పాటు వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న ఇటుక, సిమెంట్ పరిశ్రమలు సింహాద్రి ఎన్టీపీసీ ప్లాంట్ నుంచి విడుదలవుతున్న తడి, పొడి బూడిదను అధికంగా ఉపయోగిస్తున్నాయి. ఇక్కడ బూడిద చెరువుల (యాష్ పాండ్) నుంచి భారీ వాహనాలతో బూడిదను ఎన్టీపీసీ నుంచి లంకెలపాలెం వంతెన వరకు నిర్మించిన కారిడార్ రహదారి మీదుగా ఆయా ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో ఆ లారీల నుంచి ఎగసిపడుతున్న దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అనారోగ్యాలతో తరచూ ఆస్పత్రుల పాలవుతున్నారు.

నిబంధనలు గాలికి..

కలపాక దరి బూడిద చెరువుల నుంచి బూడిదను లోడ్ చేసుకొని పిట్టవానిపాలెం, పి.బోనంగి, దేశపాత్రునిపాలెం గ్రామాల మీదుగా బూడిద లారీలు ప్రయాణిస్తున్నాయి. బూడిదను తరలించే క్రమంలో పాటించాల్సిన భద్రత ప్రమాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయి. బూడిద గాలిలో ఎగరకుండా లారీలపై టార్పాలిన్‌లు పూర్తి స్థాయిలో కప్పాలి. అలా కాకుండా ఏదో మొక్కుబడిగా టార్పాలిన్లు కప్పి బూడిదను తరలిస్తున్నారు. బూడిద లారీలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో రోడ్లపై రాలి పడుతున్న పొడి బూడిద గాలిలో ఎగరకుండా నీటితో తడుపుతుండాలి. కానీ అటువంటివేవీ కాంట్రాక్టర్లు పాటించడం లేదు. ఏదో మొక్కుబడిగా వారానికొక పర్యాయం తూతూమంత్రంగా ధూళి ఎగరకుండా రోడ్లను తడుపుతూ మొక్కుబడి చర్యలు చేపడుతున్నారు.

తడి బూడిదతో ప్రమాదాలు

లారీల నుంచి తడి బూడిద కారి, రోడ్లపై ముద్దలుగా పడి ఉండడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బూడిద తరలింపు కాంట్రాక్టులు పొందిన వారి అనాలోచిత చర్యల కారణంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నిత్యం ఈ తడి, పొడి బూడిదతో నరకయాతన పడుతున్నారు.

కళ్ల మంటలు.. ఊపిరితిత్తుల సమస్యలు

బూడిద వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో రోడ్లపై రాలి, గాలికి ఎగిరి పడుతున్న దుమ్ము, ధూళి సమీప గ్రామాల ప్రజలను, ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. బూడిద లారీలు రాకపోకలు సాగించే కారిడార్ రహదారిలో ఉన్న దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలి, ఎస్‌ఈజెడ్ కూడలిలో నివసిస్తున్న ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీల రాకపోకలతో రోడ్లన్నీ ధూళి, దుమ్ముతో నిండిపోతున్నాయి. ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు రాకపోకలు సాగించే దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలి, ఎస్‌ఈజెడ్ కూడళ్లు బూడిదమయం అవుతున్నాయి. లారీల నుంచి ఎగసిపడుతున్న దుమ్ము, ధూళి ద్వారా కళ్ల మంటలు, ఊపిరితిత్తుల వంటి అనారోగ్య సమస్యలు వచ్చిపడుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రోడ్లు ఛిద్రం



బూడిద లారీల రాకపోకలతో గోతులమయమైన కారిడార్ రోడ్డు

అధిక బరువుతో ప్రయాణిస్తున్న భారీ వాహనాల కారణంగా రోడ్లు ఛిద్రమై, ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. రూ.కోట్లాది రూపాయలతో నిర్మించిన ఎన్టీపీసీ కారిడార్ రహదారే ఇందుకు ఉదాహరణ. రోడ్డంతా మోకాలి లోతు గుంతలతో నిండి, రాకపోకలకు పనికి రాకుండా పోయింది. బూడిద లారీల కారణంగా లంకెలపాలెం–సబ్బవరం రహదారి పాడై, మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది.



ఎన్టీపీసీ కారిడార్ రోడ్డుపై నిలిపిన యాష్ లారీలు

బూడిదను అరికట్టాలి



బూడిద లారీల రాకపోకలతో రాంకీ కూడలి దుమ్ము, ధూళితో నిండిపోతోంది. ధూళితో చిరు వ్యాపారాలు చేసుకొంటున్న మాలాంటి వారు తీవ్రంగా నష్టపోతున్నారు. పాన్‌షాపుల్లో సామగ్రంతా దుమ్ము పేరుకుపోవడంతో పాన్‌షాపుల వాళ్లు ఇబ్బంది పడుతున్నారు. ధూళిని అరికట్టాలని ఆందోళన చేసినా పట్టించుకోనే నాథుడే కనిపించడం లేదు.

– పిల్లా నూకరాజు, రాంకీ కూడలి

ఆరోగ్యాలు పాడవుతున్నాయి



బూడిద లారీలతో ఎగసిపడుతున్న ధూళి, దుమ్మును పీల్చడం వల్ల దగ్గు, గొంతు నొప్పి, ఆయాసం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చి పడుతున్నాయి. ఈ లారీలు జంక్షన్‌లో మొరాయిస్తే ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. రోడ్లు పాడయ్యాయి. ఎండ వస్తే దుమ్ము రేగుతుంది, వర్షం పడితే బురదతో అడుగు వేయడం కూడా కష్టమవుతుంది. చాలా ఇబ్బంది పడుతున్నాం.

– చిప్పాడ వరలక్ష్మి, దేశపాత్రునిపాలెం

ఇళ్లు, సామగ్రి పాడవుతున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కట్టుకున్న కాలనీ ఇళ్లు బూడిదతో నిండి, పాడవుతున్నాయి. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీల నుంచి వస్తున్న దుమ్ము ఇళ్లను ముంచెత్తుతోంది. ధూళి ఇళ్లలోకి చొరబడి సామగ్రి, తినుబండారాలు పాడవుతున్నాయి. ఇళ్లలో ఉండలేక పోతున్నాం. రోడ్డు గోతులమయంగా మారింది. కిలోమీటరున్నర దూరంలో ఉన్న దేశపాత్రునిపాలెం వెళ్లాలంటే కనీసం అరగంట పడుతుంది. నరకయాతన పడుతున్నాం.

– అవుగంటి ఏసుకుమార్, పి.బోనంగి

నేటి నుంచి గ్రామదేవతల పండగలు

- 11న అనుపు మహోత్సవాలు
- అలరించనున్న సాంస్కృతిక ప్రదర్శనలు



పైడిమాంబ, పరదేశిమాంబ పోలమాంబ

పరవాడ: మండలంలోని పరవాడ, తానాం, దేశపాత్రునిపాలెం గ్రామదేవతలు పైడిమాంబ, పరదేశిమాంబ, పోలమాంబ అమ్మవార్ల పండగలను ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీల ప్రతినిధులు తెలిపారు. 11న అమ్మవార్ల అనుపు మహోత్సవాలు ఉంటాయని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

పరవాడలో.. : పరవాడ గ్రామంలో ఈ నెల 9న ఆహ్వాన చిడతల పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన మొదటి ముగ్గురు విజేతలకు రూ.12వేలు, 10వేలు, 8వేల చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. 10న చింతామణి పౌరాణిక నాటకం, 11న విధి వంచన సాంఘిక నాటకాన్ని ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అదే రోజు రాత్రికి పలు ప్రాంతాల్లో మెగా డ్యాన్స్ షోలను ఏర్పాటు చేశామని వివరించారు.

తానాంలో..: తానాంలో పరదేశిమాంబ అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఈ నెల 3న ప్రారంభమైన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు 10వ తేదీ వరకు జరుగుతాయని సర్పంచ్ కన్నూరి దేవివెంకటరమణ చెప్పారు. ఆదివారం నుంచి గ్రామంలో జిల్‌జిల్ జిగేల్ రాణి, రప్పా, రపా డ్యాన్స్ షో, డాన్స్‌బేబీ డాన్స్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో డాన్స్ హంగామాలు ఉంటాయన్నారు.

దేశపాత్రునిపాలెంలో.. : దేశపాత్రునిపాలెంలో పోలమాంబ జాతర సందర్భంగా ఈ నెల 9న యముడితో ఢీ.. తగ్గేదేలే, 10న చింతామణి ప్రేమ సన్నివేశం, శ్రీరామాంజనేయుల యుద్ధంలో పలు సన్నివేశాలను ప్రదర్శిస్తారు. 11న రేలారే రేలా, డాన్స్ బేబీ డ్యాన్స్, మెగా డ్యాన్సు ఈవెంట్లను ప్రదర్శించనున్నారు. 11న రాత్రి భారీ బాణసంచాకాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి, మొక్కులు చెల్లించారు. భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

నేడు జాతీయ భద్రత వారోత్సవాలు

పరవాడ: జేఎస్‌సీసీ, ఎంఎఎస్‌ఆర్‌ఎం ఆధ్వర్యంలో అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నామని ఎంఎఎస్‌ఆర్‌ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు చెప్పారు. జేఎస్‌సీసీ ఎంఎఎస్‌ఆర్‌ఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, హోం మంత్రి వంగలపూడి అనిత, విశాఖ మేయర్ జి.హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్, నక్కపల్లి, పరవాడ ప్రాంతాల్లో ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారని ఎంఎఎస్‌ఆర్‌ఎం కార్యదర్శి సుబ్బారావు చెప్పారు. ఈ సమావేశంలో ఎంఎఎస్‌ఆర్‌ఎం అధ్యక్షుడు ప్రకాశరావు పాల్గొన్నారు.

మహిళల విజయాలు మహోన్నతం



పాపయ్యరాజుపాలెం పిరమిడ్ కేంద్రంలో మహిళలకు సత్కారం

- వారి సేవలు నిరుపమానం
- కొనియాడిన వక్తలు
- ఘనంగా మహిళా దినోత్సవం

పెందుర్తి: మహిళల విజయాలు మహోన్నతమని వక్తలు కొనియాడారు. వారి సేవలు నిరుపమానమని గుర్తు చేసుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని శనివారం ఘనంగా సత్కరించారు.

➡ పాపయ్యరాజుపాలెంలోని బ్రహ్మర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.లక్ష్మి మాధవి, డాక్టర్ డి.రమ, కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావులను ఘనంగా సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

వేపగుంటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరించి, చీరలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

పెందుర్తి ప్రాంత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చినముషిడివాడలోని ఓ పంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గిరిజన మహిళా ఉద్యోగులు, విద్యార్థులను సత్కరించారు.

➡ స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేత నాదెళ్ల జ్యోతిని ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

➡ స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో మహిళా సిబ్బందిని కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్.ఈ ఫ్లోరా సత్కరించారు.

సింహాచలం ఎంపీపీ స్కూల్లో ..

సింహాచలం: 98వ వార్డు సింహాచల్‌నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థినులకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయినులను కార్పొరేటర్ పి.వి.నరసింహం సత్కరించారు. హెచ్‌ఎం గేదెల సన్యాసిరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

➡ నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో మహిళా ఉద్యోగులను మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ కొనియాడారు. ప్రతిభ కనబరిచిన సీనియర్ వైద్యులను, సీనియర్ మహిళా ఉద్యోగులను సత్కరించారు. డాక్టర్ రవీంద్ర, డాక్టర్ కృష్ణ, డీజీఎంలు కె.బంగారురాజు, వేణుగోపాల్, ఏజీఎం ఎస్.కె.ఎల్.రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

పరవాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి పాల్గొని, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీని ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు సత్కరించారు. పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.ధర్మారావు, అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

➡ వైద్య రంగంలో విశేష సేవలందించిన వైద్యాధికారులు హారిక, జయశ్రీకరిష్మా, శిరీషలను స్థానిక వాసవి క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. ఎంఈవో సాయిశైలజను ఉపాధ్యాయులు సత్కరించారు.

పుస్తకావిష్కరణ

బాపడుపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.గంగాధర్ రచించిన ఆంధ్ర ప్రఖ్యాత మహిళామణులు పుస్తకాన్ని ఎంఈవోలు దివాకర్‌రావు, సాయిశైలజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొరుపోలు గంగాధర్‌ను ఘనంగా సత్కరించారు.

సబ్బవరం: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, అత్యున్నత పదవులను అలంకరిస్తున్నారని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఎంపీడీవో పద్మజ, మండల పరిషత్ ఏవో శివప్రసాద్ నారాయణ, పీఆర్ ఏఈ హరిణి, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి పాల్గొని, విద్యార్థులకు మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.



ఆదర్శ్‌లో అధ్యాపకులకు సత్కారం




పెందుర్తి బీజేపీ కార్యాలయంలో నాదెళ్ల జ్యోతిని సత్కరిస్తున్న బీజేపీ నేత రామునాయుడు




గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు




వేపగుంటలో మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల



మహిళా ఉద్యోగులకు బహుమతులు అందిస్తున్న శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్



పరవాడ ఎంపీపీ వెంకట పద్మలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం



పీహెచ్‌సీ వైద్యాధికారులు జయశ్రీ,కరిష్మా, హారికలను సత్కరిస్తున్న దృశ్యం



ఆంధ్ర ప్రఖ్యాత మహిళామణులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గంగాధర్, అతిథులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

యథేచ్ఛగా రోడ్డు దురాక్రమణ

- దొగ్గవానిపాలెం కాలనీలో ఇష్టానుసారం నిర్మాణాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



దొగ్గవానిపాలెం కాలనీలో దురాక్రమణకు గురైన రోడ్డు



ఆందోళన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

పెందుర్తి: జీవీఎంసీ 96వ వార్డు పరిధి దొగ్గవానిపాలెం కాలనీ (చెరువు సమీపంలో) రోడ్డును కొందరు వ్యక్తులు ఆక్రమించారు. దాదాపు 12 అడుగుల రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధం కావడంతో స్థానికులు.. రెవెన్యూ, జీవీఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. కాలనీలో సర్వే నెంబర్ 122లో గతంలో అర్హత ఉన్నవారికి 60 గజాల చొప్పున ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. అప్పట్లోనే నిర్మాణాలు జరగగా కొందరు ఇటీవల ఇళ్లను పునర్నిర్మించుకుంటున్నారు. అయితే అప్పట్లో కాలనీకి కేటాయించిన 12 అడుగుల రోడ్డును పూర్తిగా ఆక్రమించి ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతున్నారు. తమ కాలనీలో కేవలం 60 గజాల స్థలాలకు మాత్రమే పట్టాలు ఇవ్వగా, పక్కనే ఉన్న రోడ్డు స్థలాలను కూడా కలుపుకొని నిర్మాణాలు చేస్తున్నారని.. దానివలన తమ నివాసాలకు కనీసం నడక బాట కూడా మిగలడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు దురాక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేత్రపర్వం.. నిత్య కల్యాణం



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వామికి సహస్రనామార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి, 1001నామాలతో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

కమనీయం..కల్యాణం: అప్పన్న నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవ మూర్తులను ఉంచి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై ఆసీనులను చేసి, అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. హారతి అందజేశారు.